క్లుప్తంగా

చెరువులకు వేలం పాట



వనదుర్గాపురంలో వేలంలో పాల్గొన్న గ్రామస్తులు

పాలసముద్రం: మండలంలోని వనదుర్గాపురం, వెంగళరాజుకుప్పం పంచాయతీల్లో గురువారం చెరువులకు వేలం పాట నిర్వహించారు. పంచాయతీ కార్యదర్శి సత్యనారాయణ మాట్లాడుతూ వేలం పాటలో వనదుర్గాపురం పాత చెరువును రూ.15,300కు దక్కించుకున్నారని చెప్పారు. రాజుగుంట చెరువు తీసుకోవడానికి ఎవరూ ముందుకు రాలేదన్నారు. వెంగళరాజుకుప్పం చెరువును రూ.లక్షా ఐదు వేలకు పాడారని తెలిపారు. ఈ వేలంపాటలో సర్పంచ్ నరసింహరాజు, లిల్లీ పాల్గొన్నారు.

లైన్ ట్రిప్పింగ్స్ నమోదు చేయండి

చిత్తూరు కార్పొరేషన్: డివిజన్ పరిధిలో లైన్ ట్రిప్పింగ్స్‌ను నమోదు చేయాలని ట్రాన్స్‌కో ఈఈ మునిచంద్ర తెలిపారు. ప్రస్తుతం అడపాదడపా వర్షం పడుతున్నందున అక్కడక్కడ లైన్ ట్రిప్పింగ్స్ అవుతున్నట్లు చెప్పారు. సెక్షన్, సబ్‌స్టేషన్, ఫీడర్, ట్రాన్స్‌ఫార్మర్ వారీగా ఎప్పుడు కరెంటు సరఫరా నిలిచింది? తిరిగి పునరుద్ధరణ ఎప్పుడు చేశారో అనే అంశాలపై నివేదిక ఇవ్వాలన్నారు. దీనిని బట్టి ఎండకాలంలో సమస్యలు రాకుండా ముందస్తు జాగ్రత్తలు తీసుకుంటామని చెప్పారు. అవసరమైన ప్రాంతాల్లో ట్రాన్స్‌ఫార్మర్ల సామర్థ్యం పెంచుతామన్నారు. దీంతో లో–ఓల్టేజీ సమస్యలు నివారించవచ్చని వివరించారు. క్షేత్రస్థాయిలో సిబ్బంది అప్రమత్తంగా ఉండాలన్నారు. విద్యుత్ పోతే సకాలంలో పునరుద్ధరించాలన్నారు. ఎటువంటి సమస్యలున్నా ఏఈ, డీఈలకు తెలపాలని వివరించారు.

పీహెచ్‌సీల్లో కాన్పుల సంఖ్యను పెంచండి



ఆస్పత్రిలో సెలైన్ బాటిల్స్‌ను తనిఖీ చేస్తున్న వైద్యాధికారి

గుడిపాల: ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల్లో కాన్పుల సంఖ్యను పెంచాలని జిల్లా వ్యాధి నిరోధక టీకాల అధికారి(డీఐఓ) తెలిపారు. స్థానిక పీహెచ్‌సీని గురువారం ఆయన ఆకస్మికంగా తనిఖీ చేశారు. డీఐఓ మాట్లాడుతూ ఆస్పత్రిలో కాన్పుల సంఖ్యను మరింతగా పెంచాలని డాక్టర్ సంధ్యకు సూచించారు. ఆరోగ్య కేంద్రానికి వచ్చే రోగులకు సరైన చికిత్స చేయాలని, 24 గంటలు సిబ్బంది అందుబాటులో ఉండాలని చెప్పారు. చిన్నపిల్లల టీకాలు 100శాతం పూర్తి చేయాలని చెప్పారు. అనంతరం ఆరోగ్య కేంద్రంలో కాన్పులగది, ల్యాబ్ రూమ్, ఇంజక్షన్ రూమ్‌లను తనిఖీ చేశారు. ఇంజక్షన్‌లు, సెలూన్ బాటిళ్ల వ్యాలిడిటీని తనిఖీలు చేశారు.

శుభ్రతతోనే రోగాలు దూరం

తవణంపల్లె: శుభ్రతతోనే రోగాలు దూరమవుతాయని వైద్యాధికారి డాక్టర్ మోహన్‌వేలు తెలిపారు. మండలంలోని కృష్ణాపురంలో గురువారం ఫ్యామిలీ డాక్టర్ కార్యక్రమం నిర్వహించారు. డాక్టర్ మోహన్‌వేలు ప్రజలకు ఆరోగ్య సూత్రాలను వివరించారు. గ్రామాల్లో పరిశుభ్రంగా ఉంటే వ్యాధులు దరిదాపుల్లోకి రావని సూచించారు. అనంతరం ఏర్పాటు చేసిన వైద్య శిబిరంలో 47 మంది రోగులకు వైద్య పరీక్షలు చేయించి ఉచితంగా మందులు పంపిణీ చేశారు. గర్భవతులు, బాలింతలు, చిన్నారులు, బీపీ, సుగర్‌వ్యాధిగ్రస్తులకు పరీక్షలు చేయించి మందులు అందజేశారు. కార్యక్రమంలో ఆరోగ్య పర్యవేక్షకులు రాజశేఖర్, హెల్త్ అసిస్టెంట్ సుబ్రమణ్యం రెడ్డి, ఎంఎల్‌హెచ్‌పీ, ఏఎన్‌ఎం, డీఈఓ పాల్గొన్నారు.

రూ.లక్ష విరాళం



నగదు అందజేస్తున్న దాతలు

కాణిపాకం: కాణిపాకంలోని శ్రీ వరసిద్ధి వినాయకస్వామి దేవస్థానం నిత్య అన్నదానం ట్రస్టుకు గురువారం ఓ దాత నగదు విరాళంగా అందించారు. తమిళనాడు వేలూరుకు చెందిన దామోదర్ రూ.1,00,116 నగదును ఆలయ ఈవో గురుప్రసాద్‌కు అందజేశారు. అనంతరం దాత కుటుంబానికి ఆలయ అధికారులు ప్రత్యేక దర్శన ఏర్పాట్లు చేశారు.

ధ్యానంతో మానసిక రుగ్మతలు మాయం

ఐరాల: ధ్యానంతో మానసిక రుగ్మతల ను దూరం చేసుకోవచ్చని స్థానిక పీహెచ్‌సీ డాక్టర్ పూర్ణలత అన్నారు. గురువారం ప్రపంచ మానసిక దినోత్సవాన్ని పీహెచ్‌సీలో నిర్వహించారు. ఆమె మాట్లాడుతూ విద్యార్థులు, యువతను ఒత్తిడి, మానసిక రుగ్మతల నుంచి వ్యాయామం, ధ్యానం దూరం చేస్తాయని తెలిపారు. శారీరక ఆరోగ్యం బాగుండాలి అంటే మానసిక ఆరోగ్యం కూడా బాగుండాలన్నారు. ఒత్తిడి, ఆందోళన, డిప్రెషన్‌లను నిర్లక్ష్యం చేయవద్దని సూచించారు. ఈ కార్యక్రమంలో వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

కాలిబాటతో అధిక దిగుబడి

- వరి సాగుకు అనుకూలం
- అదనపు దిగుబడి ఖాయం
- ఎన్నో లాభాలున్నాయంటున్న అధికారులు



కాలిబాట పద్ధతిలో సాగు చేసిన వరి పంట

విజయపురం : వరి పంట సాగులో కాలిబాటల విధానంతో అధిక దిగుబడి సాధించవచ్చు. దీంతోపాటు మరిన్ని ప్రయోజనాలు ఉన్నాయని వ్యవసాయాధికారులు చెబుతున్నారు. అయితే గ్రామాల్లోని చాలా మంది రైతులు కాలిబాటలపై ఆసక్తి చూపడం లేదు. అదనపు ఖర్చు తప్ప ప్రయోజనం లేదన్న అపోహ వారిలో ఉంది. కాలిబాట విధానంలో వరి నాట్లు తొలగించడం వల్ల దిగుబడి తగ్గుతుందన్న భావన ఉంది. దీంతో ఈ విధానం అంతగా ప్రాచుర్యంలోకి రాలేదు. అయితే నాట్లువేసిన పొలంలో రెండు మీటర్ల దూరంలో కాలిబాటలు వేయడం వల్ల మంచి ఫలితాలు ఉంటాయని వ్యవసాయ నిపుణులు సూచిస్తున్నారు.

లాభాలు ఇలా..

కాలిబాటలతో మొక్క వేరు భాగానికి గాలి, సూర్యరశ్మి బాగా తగిలి చీడపీడల సమస్య తగ్గుతుంది. ఎరువులు, పురుగు మందులు చల్లడానికి అనువుగా ఉంటుంది. కాలిబాటల వెంట తిరుగుతూ ఎరువులు, పురుగుమందులు చల్లితే ప్రతి వరిదుబ్బుకు అందించడానికి అనువుగా ఉంటుంది. దీంతో ఎకరాకు మూడు నుంచి నాలుగు బస్తాల మేర అదనంగా దిగుబడి సాధించే అవకాశం ఉందని చెబుతున్నారు. చీడ పీడల బెడద కొంతవరకూ తగ్గుతుంది. కలుపు తొలగించడానికి, తెగుళ్ల, చీడపీడలు ఆశిస్తే సులభంగా గుర్తించడానికి, ఎలుకల నివారణకు అనువుగా ఉంటుంది. తుపాన్లు, భారీ వర్షాలు వంటి ప్రకృతి వైపరీత్యాలు వచ్చినప్పుడు పైరులో కిరణ జన్య సంయోగ క్రియ సమర్థవంతంగా జరిగి దిగుబడి తగ్గకుండా కాలిబాటలు ఉపయోగపడతాయి. వ్యవసాయ సిబ్బంది కాలి బాటల ప్రయోజనాలు రైతులకు వివరించడంతో ఇటీవల బాటలు వేసే రైతుల సంఖ్య గణనీయంగా పెరిగింది.

కాలిబాటలు వేసే విధానం

కాలిబాటలు వేసే సమయంలో రైతులు సరైన యాజమాన్య పద్ధతులు పాటించాలని వ్యవసాయ అధికారులు సూచిస్తున్నారు. ప్లాస్టిక్ లేదా కొబ్బరి డొక్కుతాడు తీసుకుని చేను గట్టుకు ఒకవైపు నుంచి మరోవైపు గట్టుకు బాగా సాగదీసి కట్టాలి. తాడు వెంట 12 సెంటీమీటర్ల వెడల్పున వరినాట్లు తొలగించాలి. ఈ నాట్లు పొలంలో పల్చగా ఉన్న ప్రాంతాల్లో నాటుకోవచ్చు. వెదజల్లే పద్ధతిలో సాగు చేసేవారు విత్తనాలు చల్లిన 15 రోజుల నుంచి 20 రోజుల వ్యవధిలో వరిమొక్కలు తొలగించి కాలిబాటలు వేసుకోవాలి.

ప్రయోజనకరం

రైతులు పొలంలో కాలిబాటలు తప్పనిసరిగా వేసుకోవాలి. దీనివల్ల లాభమే తప్ప నష్టం ఉండదు. ఎకరం పొలంలో కాలి బాటలు వేయడానికి రూ.800 నుంచి రూ.1000 వరకూ మాత్రమే ఖర్చు అవుతుంది. వీటివల్ల నాలుగైదు బస్తాల అదనపు దిగుబడి రావడమేకాక, కలుపు మొక్కల తొలగింపు, చీడపీడలు సకాలంలో గుర్తించడం, సస్యరక్షణ చర్యలు తీసుకోవడం, ఎలుకల వల్ల కలిగే నష్టాన్ని తగ్గించడం వంటి ఉపయోగాలున్నాయి. నిర్వహణ ఖర్చులు ఎకరాకు రెండు నుంచి మూడువేల వరకూ రైతులకు మిగులుతుంది.

– రజినికుమారి, ఏవో, విజయపురం.

పారదర్శకంగా మద్యం దరఖాస్తుల స్వీకరణ



మాట్లాడుతున్న డిప్యూటీ కమిషనర్ విజయ్‌శేఖర్

పుత్తూరు: మద్యం షాపుల దరఖాస్తుల స్వీకరణ పారదర్శకంగా జరుగుతోందని ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ డిప్యూటీ కమిషనర్ టి.విజయ్‌శేఖర్ తెలిపారు. పుత్తూరు ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ స్టేషన్‌లో గురువారం ఆయన తనిఖీలు నిర్వహించారు. పుత్తూరు స్టేషన్ పరిధిలో ఇప్పటి వరకు వచ్చిన దరఖాస్తుల వివరాలు, దరఖాస్తుల స్వీకరణ రికార్డులను పరిశీలించారు. అనంతరం విజయ్‌శేఖర్ మీడియాతో మాట్లాడుతూ పుత్తూరు స్టేషన్ పరిధిలోని మొత్తం 18 మద్యం షాపులకుగాను గురువారం సాయంత్రానికి 132 దరఖాస్తులు వచ్చినట్లు తెలిపారు. అందులో పుత్తూరుకు కేటాయించిన 7 షాపులకు గాను 55, నారాయణవనానికి చెందిన 3 షాపులకు 41, వడమాలపేట 4 షాపులకు 24, రామచంద్రాపురం 4 షాపులకు గాను 12 దరఖాస్తులు వచ్చినట్లు వివరించారు. ఈ నెల 11వ తేదీ సాయంత్రం 5 గంటల వరకు దరఖాస్తుల స్వీకరణ ఉన్న నేపథ్యంలో మరిన్ని దరఖాస్తులు వస్తాయని ఆశాభావం వ్యక్తం చేశారు. జిల్లా కలెక్టర్ ఆధ్వర్యంలో ఈనెల 14వ తేదీ ఉదయం 8 గంటలకు తిరుపతిలోని శిల్పారామంలో లాటరీ పద్ధతిలో డ్రా తీయనున్నట్లు వివరించారు. దరఖాస్తుదారులు అదే రోజు ఉదయం 7 గంటలకే హాజరు కావాలని తెలిపారు. లాటరీ పొందిన వారు 16వ తేదీ నుంచి దుకాణాలు నిర్వహించుకోవచ్చునని తెలిపారు. కార్యక్రమంలో అసిస్టెంట్ ఎక్సైజ్ సూపరిండెంట్ బి.సుబ్రమణ్యం, సీఐ బి.మురళీమోహన్, ఎస్.ఐ శివప్రసాద్ పాల్గొన్నారు.

అత్యధికంగా దరఖాస్తులు

కార్వేటినగరం: పాలసముద్రంలోని ఒక మద్యం షాపునకు అత్యధికంగా దరఖాస్తులు వచ్చాయని ఎక్సైజ్ అండ్ ప్రొహిబిషన్ చిత్తూరు జిల్లా డిప్యూటీ కమిషనర్ టి.విజయ్‌శేఖర్ తెలిపారు. ఆయన గురువారం కార్వేటినగరం ఎక్సైజ్ కార్యాలయంలో విలేకరుల సమావేశంలో మీడియాతో మాట్లాడారు. కార్వేటినగరం పరిధిలోని వెదురుకుప్పం, శ్రీరంగరాజపురం, కార్వేటినగరం, పాలసముద్రం మండలాల్లో కొత్తగా మద్యం షాపుల నిర్వహణకు ఎక్కువ మంది వ్యాపారులు దరఖాస్తులు చేసుకుంటున్నారని చెప్పారు. అందులో తమిళనాడుకు సరిహద్దు ప్రాంతంలో ఉన్న పాలసముద్రంలోని ఒక్క షాపునకు మాత్రం అత్యధికంగా దరఖాస్తులు చేసుకున్నారని ఆయన వివరించారు. ప్రభుత్వం 11వ తేదీ సాయంత్రం వరకు గడువు పెంచడంతో మరిన్ని దరఖాస్తులు వచ్చే అవకాశం ఉందని, తద్వారా ప్రభుత్వ ఖజానాకు మరింత ఆదాయం చేకూరుతుందని ఆయన పేర్కొన్నారు. అనంతరం వ్యాపారులు ఇతర వివరాలకు టోల్‌ఫ్రీ నంబర్‌ను సంప్రదించవచ్చని ప్లకార్డును ఆవిష్కరించారు. ఎక్సైజ్ సీఐ శిరీషాదేవి, ఎస్ఐలు పాల్గొన్నారు.

కల్తీ మందులు, విత్తనాలు విక్రయిస్తే చర్యలు

–ఏడీఈ సుబ్రమణ్యం



ఎరువులడీలర్ల సమావేశంలో మాట్లాడుతున్న ఏడీఏ సుబ్రమణ్యం

సత్యవేడు: ఎరువుల డీలర్లు రైతులకు కల్తీ విత్తనాలు, నాసిరకం పురుగు మందులు విక్రయిస్తే చర్యలు తప్పవని ఏడీఈ సుబ్రమణ్యం హెచ్చరించారు. గురువారం సత్యవేడు వ్యవసాయ కార్యాలయంలో డివిజన్ పరిధిలోని నాగలాపురం, పిచ్చాటూరు, సత్యవేడు, వరదయ్యపాళెం మండలాల్లోని ఎరువులు, విత్తనాల లైసెన్సు డీలర్లకు సమావేశం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ, డీలర్లు ఎరువులు, పురుగు మందులు విక్రయించినప్పుడు తప్పనిసరిగా రైతులకు బిల్లులు ఇవ్వాలన్నారు. షాపుల వద్ద ధరల పట్టిక, స్టాకు బోర్డులు ఏర్పాటు చేసి రోజు వారీ స్టాకు, ధర వివరాలు అందులో తెలియజేయాలన్నారు. అనుమతులు లేని పురుగు మందులు , విత్తనాలు అమ్మరాదని హెచ్చరించారు. దుకాణంలో లైసెన్సులు, అనుబంధ పత్రాలు కనిపించే విధంగా ఉంచాలన్నారు. రైతులకు అవసరమైనంత మేరకే మందులు ఇవ్వాలని, అవసరం లేని వాటిని అంటగట్టరాదన్నారు. వేయింగ్ మెషిన్‌కు ప్రతి ఏటా సీల్ వేయించాలని, తూనికలకు ముద్రలు తప్పనిసరిగా ఉండాలన్నారు. తనిఖీల సమయంలో ఇవేవీ లేనట్లు గుర్తిస్తే కేసులు నమోదు చేస్తామన్నారు. అలాగే వ్యవసాయ అధికారుల సిఫార్సుల మేరకే రైతులకు పిచికారీ మందులు ఇవ్వాలన్నారు. నెల వారీ రిపోర్టులు ప్రతి నెలా 19వ తేదీన ఏఓకు అందజేయాలన్నారు. కార్యక్రమంలో ఏఓలు మురళి (సత్యవేడు), సంజీవరెడ్డి(పిచ్చాటూరు), సుబ్బారావు(నాగలాపురం), వ్యవసాయ సిబ్బంది, డీలర్లు పాల్గొన్నారు.

మానసిక ఆరోగ్యంపై దృష్టి



ర్యాలీ నిర్వహిస్తున్న వైద్య ఆరోగ్య సిబ్బంది

చిత్తూరు రూరల్ (కాణిపాకం): మానసిక ఆరోగ్యం లేని వ్యక్తి పరిపూర్ణ ఆరోగ్య వంతుడు కాదని, అందుకే దానిపై ప్రత్యేక దృష్టి పెట్టాలని చీఫ్ లీగల్ ఎయిడ్ డిఫెన్స్ కౌన్సిల్ భానుశేఖర్‌రెడ్డి అన్నారు. చిత్తూరు నగరంలో గురువారం ప్రపంచ మానసిక దినోత్సవాన్ని నిర్వహించారు. ప్రభుత్వం, అపోలో ఆధ్వర్యంలో చిత్తూరు ప్రభుత్వ ఆస్పత్రి నుంచి గాంధీ విగ్రహం వరకు ర్యాలీ నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ మానసిక అనారోగ్యాన్ని చాలా మంది నిర్లక్ష్యం చేస్తున్నారన్నారు. సాధారణంగా మానసిక రోగులు, రుగ్మతల గురించి మాట్లాడడానికి సమాజంలో ఎంతో సిగ్గు, నిర్లక్ష్య భావం కనబరుస్తారన్నారు. మానసిక ఆందోళనతో ఆత్మహత్యలు చేసుకుంటున్నారని చెప్పారు. ఎప్పుడైతే ఒత్తిడి తన జీవన శైలిపై ప్రభావం చూపించడం జరుగుతుందో వెంటనే మానసిక వైద్యుల సహాయం తీసుకోవాలని చెప్పారు. మన చుట్టూ ఉన్నవారితో కలవడం మనకు మానసిక స్థైర్యాన్ని ఇస్తుందన్నారు. సన్నిహితులతో ఎక్కువ సమయం గడపడం ద్వారా మానసిక శక్తిని పెంచుకోవచ్చని చెప్పారు. ఈ కార్యక్రమంలో అధికారులు శిరీష, శ్రీవాణి, అపోలో నిర్వాహకులు నరేష్‌కుమార్‌రెడ్డి, సుధాకర్ బాబు, దినేష్ తదితరులు పాల్గొన్నారు.

లుంగీ కార్మికుల బతుకు దుర్భరం

- గిట్టుబాటు కాని కూలి
- వృత్తికి దూరమవుతున్న నేత కార్మికులు
- ప్రభుత్వ సాయం కోసం ఎదురుచూపు
- నేతన్నలకు ఉచిత విద్యుత్ హామీ నెరవేర్చని ప్రభుత్వం



మగ్గంలో లుంగీ వస్త్రం నేస్తున్న నేత కార్మికుడు

సత్యవేడు: మండలంలో రెండు దశాబ్దాల క్రితం దాదాపు 2000 కుటుంబాలకు పైగా నేత కార్మికులు ఉండేవారు. క్రమం క్రమంగా వృత్తి పనులు గిట్టుబాటుకాక ఇతరత్రా వాటికి మరలడంతో ప్రస్తుతం 500 కుటుంబాలకు లోపే నేత కార్మికులు ఉంటున్నారు.

లుంగీలకు గిరాకీ

మార్కెట్‌లో నేత కార్మికులు తయారుచేస్తున్న శంఖు మార్కు లుంగీలకు మంచి డిమాండ్ ఉంది. కానీ ఆ లుంగీలు తయారు చేస్తున్న నేత కార్మికులకు మాత్రం స్వల్పంగా కూలీ దక్కుతోంది. రేయింబవళ్లూ రెక్కాడినా డొక్క నిండక బతుకులు ఇబ్బందుల నడుమ సాగిస్తున్నారు.

మదనంబేడు లుంగీల నేత కార్మికులు

మదనంబేడు పంచాయతీ కేఎస్‌పేటలో శంఖు మార్కు, కిబ్స్ మార్కు లుంగీలు నేస్తున్న కార్మికుల కుటుంబాలు 25 వరకూ ఉన్నాయి. గతంలో ఒక్క మదనంబేడులోనే 200 కుటుంబాలకు పైగా లుంగీలు తయారు చేసేవారు. లుంగీ తయారీ నేతకు కావాల్సిన ముడిసరుకులైన పడుగు, పేక, మునుపు తక్కువ ధరలో మార్కెట్‌లో లభించేవి. అప్పుడు సొంతంగా కార్మికులు లుంగీలు తయారు చేసిన వ్యాపారులకు విక్రయించి ఆదాయం కళ్లజూసేవారు. ప్రస్తుతం పడుగు, పేక ధరలు ఆకాశాన్ని తాకుతుండడంతో కార్మికులు సొంతంగా వీటిని కొనలేక మాస్టర్ వీవర్స్, పెద్ద పెద్ద కంపెనీలు యజమానులు తక్కువగా ఇచ్చే కూలీతో ఇప్పుడు లుంగీలు నేస్తున్నారు. కుటుంబంలో దంపతులిద్దరూ పనిచేస్తేగానీ నేత పని జరగదు. రోజంతా కుటుంబీకులు కలసి పనిచేసినా రూ. 400 కూడా గిట్టడం లేదు. ఈ నేపథ్యంలో నేత కార్మికులు కుటుంబ భారం మోయలేక ఇతర వృత్తులు, పనుల వైపు మరలుతుండడంతో నేత కార్మికుల సంఖ్య పడిపోతోంది.

మార్కెట్‌లో గిరాకీ ఉన్నా కూలి లేదు

వాస్తవానికి చెన్నై మార్కెట్‌లో శంఖు, కిబ్స్ మార్కుల లుంగీలకు మంచి గిరాకీ ఉంది. వ్యాపారులు మాత్రం లాభాలు గడిస్తున్నారు. అయితే నేత కార్మికులకు మాత్రం కూలీ లేదు. పవర్ లూమ్స్‌లో ఎన్ని లుంగీలు తయారైనా ఇప్పటికీ చేనేత లుంగీలకు డిమాండ్ ఉంటోంది.

నేత పనిలో కుటుంబం

ఒక వస్త్రం లేదా ఒక లుంగీ తయారు చేసేందుకు మొదట మహిళలు పేక నూలును రాట్నంతో వడికి పడుగుగా తయారు చేస్తారు. వాటిని మహిళే అచ్చులో అతికిస్తారు. మగవారు అల్లు పట్టి నేతకు ఉపయోగిస్తారు. మగ్గంపై నేతకు అవసరమైన నూలును, కండీలుగా వృద్ధులు, లేక పిల్లలు చుట్టిస్తారు. 16 మీటర్లు నేత పనిలో 8లుంగీలు తయారు చేస్తారు. ఇలా ఇంటిల్లిపాదీ పనిచేస్తారు. రోజుకు రెండు లేదా మూడు లుంగీలు నేస్తారు.

పని ఉన్నా గిట్టుబాటు లేదు



“ లుంగీలు ఎన్ని తయారు చేసినా తీసుకుంటామని యజమానులు ఆర్డర్లు ఇస్తున్నారు. అయితే 8 లుంగీలు నేస్తే రూ.700 ఇస్తున్నారు. వారానికి 16 లుంగీలు నేస్తే రూ.1400 వస్తోంది. రోజుకు రెండు వందలు కూలీ అందుతోంది. దీంతో జీవనం కష్టంగా ఉంది.

– బి. సుబ్రమణ్యం, మదనంబేడు.

నిత్యావసరాలు కొనలేకున్నాం



కూరగాయలు, పప్పుదినుసులు, నూనెధరలు కూడా చుక్కలనంటాయి. నేత పనితో వారికి వచ్చే డబ్బు కూరగాయలు, పప్పుదినుసులకే చాలడంలేదు. కరెంటు బిల్లు కట్టలేని పరిస్థితిలో ఉన్నాం. వారంలో ఎక్కువ రోజులు ఊరగాయతో అన్నం తింటున్నాం. ఇంకేం చేస్తాం.

– మల్లీశ్వరమ్మ, మదనంబేడు

వడ్డీ రహిత రుణాలు ఇవ్వాలి



ప్రభుత్వం నేత కార్మికులకు వడ్డీ లేని రుణాలు మంజూరు చేయాలి. చేనేత కార్మికుల ఇంటికి ఉచిత విద్యుత్ ఇస్తే ఎంతో మేలు. ప్రస్తుతం వర్షాలు పడుతుండడంతో పడుగు పేక చెమ్మ గిల్లి పనులు జరగడం లేదు. పని లేక అప్పులు చేయాల్సిన పరిస్థితి. నేత కార్మికులను ప్రభుత్వమే ఆదుకోవాలి.

– ఏ.తిరుపతి, మదనంబేడు

మమ్మేలుకోవమ్మా.. మాతల్లి దుర్గమ్మ







నగరి: మహాగౌరీ దేవికి కర్పూరహారతి, ఓంశక్తి ఆలయంలో భక్తులకు అన్నదానం, పుత్తూరు: మహాచండీ యాగం నిర్వహిస్తున్న పండితులు

నగరి : దసరా ఉత్సవాల్లో భాగంగా గురువారం నగరి నియోజకవర్గంలోని దేవీ ఆలయాల్లో అమ్మవార్లు పలు రూపాల్లో దర్శనమిచ్చారు. ప్రత్యేక అలంకరణలో ఉన్న అమ్మవారిని దర్శించుకోవడానికి భక్తులు ఆలయాలకు క్యూకట్టారు. బుగ్గ అగ్రహారం ఒన్నూరమ్మ దేవాలయంలో అమ్మవారు సరస్వతి అలంకరణలో భక్తులకు దర్శనమివ్వగా టీఆర్ కండ్రిగ నేత్రప్రదాయణి దేశమ్మ దేవత ఆలయంలో దుర్గాదేవి అలంకరణలో భక్తులకు దర్శనమిచ్చారు. పట్టణ పరిధిలోని కరకంతేశ్వరాలయంలో కామాక్షి అమ్మవారికి మహాకాళి అలంకరణ చేశారు. టీటీడీ ఆధీనంలోని బుగ్గ కాశీవిశ్వేశ్వర స్వామి ఆలయంలోని అన్నపూర్ణాదేవికి మహాగౌరి అలంకారం చేశారు. స్థానిక ఓంశక్తి ఆలయంలో నవరాత్రి ఉత్సవాలను పురస్కరించుకొని అమ్మవారి చిత్రపటానికి ప్రత్యేక అలంకరణ చేశారు. కుంకుమ పూజలు నిర్వహించారు. ఆలయం భక్తులకు అన్నదానం చేశారు.

దుర్గాదేవిగా గంగమ్మ

పుత్తూరు: దసరా ఉత్సవాల్లో భాగంగా గురువారం గ్రామదేవత పిడికిలి గంగమ్మ దుర్గాదేవి అలంకరణలో భక్తులకు దర్శనమిచ్చారు. పట్టణంలోని ఆరేటమ్మ సరస్వతీదేవిగా, కన్యకాపరమేశ్వరి గజలక్ష్మీగా భక్తులకు దర్శనమిచ్చారు. అంతకు ముందు అన్ని ఆలయాల్లో ఉదయాన్నే అమ్మవార్లకు విశేష అభిషేకాలు, అర్చనలు నిర్వహించారు. భక్తులకు తీర్థప్రసాదాలు పంపిణీ చేశారు.

వైభవం.. మహాచండీ యాగం

పుత్తూరు: పట్టణంలోని శ్రీకన్యకా పరమేశ్వరి ఆలయంలో గురువారం సాయంత్రం మహాచండీ యాగం వైభవంగా నిర్వహించారు. దసరా నవరాత్రుల ఉత్సవాల్లో భాగంగా ఉదయం 7 గంటల నుంచి మధ్యాహ్నం 12.30 గంటల వరకు గణపతి ఆరాధన, నవగ్రహ పంచలోక పాలన, అష్టదిక్పాలక ఆరాధన హోమం, శ్రీలక్ష్మీనారాయణస్వామి రుద్ర, మృత్యుంజయ, ధన్వంతరి, శ్రీవాసవీ కన్యకాపరమేశ్వరి ఆరాధన కార్యక్రమాలను శాస్త్రోక్తంగా నిర్వహించారు. అనంతరం అమ్మవారిని పట్టు పీతాంబరాలు, విశేష స్వర్ణాభరణాలు, సుగంధ పరిమళభరిత పుష్పమాలికలతో సుందరంగా గజలక్ష్మీ అలంకరణలో కొలువుదీర్చి భక్తులకు దర్శన భాగ్యం కల్పించారు. సాయంత్రం తొలుత కలశ ప్రతిష్ఠ చేసి, వినాయక పూజ, పలు వైదిక క్రతువులను శాస్త్రోక్తంగా నిర్వహించారు. అనంతరం మహాచండీ ఆరాధన పూజ కనుల పండువగా నిర్వహించారు. పెద్ద సంఖ్యలో పాల్గొన్న భక్తులకు తీర్థ ప్రసాదాలను పంపిణీ చేశారు. ఆలయాన్ని విద్యుత్ దీపాలతో అందంగా అలంకరించారు.

కార్వేటినగరంలో..

కార్వేటినగరం: శరన్నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా గురువారం శ్రీబంగారమ్మ దుర్గాదేవీ అవతారంలో భక్తులకు దర్శనమిచ్చారు. అదేవిధంగా ఆలత్తూరులోని ముత్యాలమ్మ ఆలయంలో అమ్మవారిని పట్టు వస్త్ర సుగంధ భరిత పుష్పమాలికలతో అలంకరించి భక్తులకు దర్శన భాగ్యం కల్పించారు.

పాలసముద్రంలో..

పాలసముద్రం: బలిజకండ్రిగలో వెలసిన చెవుటి గంగమ్మ, మిద్దినత్తం గ్రామంలో వెలసిన పడవేటమ్మ లక్ష్మీదేవి అలంకరణలో భక్తులను కటాక్షించారు.

వెదురుకుప్పంలో..

వెదురుకుప్పం: డీఆర్ఎస్ కండ్రిగ సమీపంలోని జ్ఞాన ప్రసూనాంబ సమేత కొండమల్లీశ్వరస్వామి ఆలయం ఆవరణలో ఉన్న రాజరాజేశ్వరి దేవి దుర్గాదేవి అలంకరణలో రాజరాజేశ్వరిగా భక్తులకు దర్శనమిచ్చారు. చవటగుంటలోని మీనాక్షి సమేత ఆవుదేవ నందీశ్వరస్వామి ఆలయంలో మీనాక్షి అమ్మవారు దుర్గాదేవిగా భక్తులను కటాక్షించారు.

జీడీ నెల్లూరులో..

గంగాధర నెల్లూరు: మండల కేంద్రంలోని అల్లిఎల్లమ్మ దేవస్థానంలో అమ్మవారు దుర్గాదేవిగా భక్తులకు దర్శనం ఇచ్చారు.



నగరి: దుర్గాదేవి అలంకరణలో దేశమ్మ



పుత్తూరు: దుర్గాదేవిగా గంగమ్మ




నగరి: మహాకాళి అలంకరణలో కామాక్షి దేవి



కార్వేటినగరంలో..



ఆలత్తూరులో..



బలిజకండ్రిగలో..



వెదురుకుప్పంలో..



జీడీ నెల్లూరులో..